## పౌష్టికాహారం సద్వినియోగం చేసుకోండి

వర్గల్, మార్చి 20: ఐదేండ్లలోపు పిల్లలకు అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్ రాణి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన పోషణ్ పక్వాడా కార్యక్రమంలో సీడీపీవో, వర్గల్ వైద్య బృందం ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో పోషణ్ అభియాన్ టీం సభ్యులు, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు, హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**సిద్దన్నపేటలో...**

నంగునూరు, మార్చి 20 : మండలంలోని సిద్దన్నపేటలో పోషణ్ పక్షోత్సవాల్లో భాగంగా బుధవారం సామూహిక సీమంతాలు, అన్నప్రాసన, అక్షరాభ్యాసం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలు, తల్లులు, కిశోర బాలికలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సీడీపీవో రమాదేవి, సూపర్‌వైజర్ స్వరూప, ఏఎన్ఎం సరస్వతి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

**ఇందుప్రియాల్‌లో...**

రాయపోల్,మార్చి 20: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తున్నదని ఐసీడీఎస్ బ్లాక్ కోఆర్డినేటర్ శ్యామ్‌సన్ అన్నారు. బుధవారం దౌల్తాబాద్ మండలం ఇందుప్రియాల్ అంగన్‌వాడీ కేంద్రంలో మండల స్థాయి పోషణ్‌పక్వాడా కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్ వైజర్లు అనురాధ, గిరిజ, పోషణ్ అభియాన్ జిల్లా కో ఆర్డినేటర్ వెంకటప్రసాద్, ఎన్‌హెచ్‌టీఎస్ఐటీ జిల్లా కోఆర్డినేటర్ చంద్రప్రకాశ్, జిల్లా మహిళా సాధికారిత కేంద్రం ఫైనాన్షియల్ లిటరసీ స్పెషలిస్ట్ నాగరాజు, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఆశలు, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.



నంగునూరు: సిద్దన్నపేటలో జరిగిన పోషణ్ పక్షోత్సవ కార్యక్రమం

# భారీగా నష్టం

## కడగండ్లు మిగిల్చిన వడగండ్లు

- నష్టపోయిన పంటలను పరిశీలించిన ప్రజాప్రతినిధులు, అధికారులు
- ప్రభుత్వం పంట నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్

తొగుట, మార్చి 20: అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాంరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని వెంకట్రావుపేటకు చెందిన బెజ్జనమైన కనకయ్య, జంగపల్లి నర్సింహులుకు చెందిన మొక్కజొన్న పంటను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పంట చేతికొచ్చే సమయంలో అకాల వర్షాలు దెబ్బతీశాయన్నారు. ఎకరాకు రూ.10 వేల నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతుబంధు సమితి మాజీ అధ్యక్షుడు స్వామి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**మామిడితోటలను పరిశీలించిన డీఏవో**

నంగునూరు, మార్చి 20: మండలంలోని దర్గపల్లిలో వడగండ్లకు దెబ్బతిన్న మామిడి తోటలను జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దెబ్బతిన్న పంటల నమూనాలను సేకరించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి గీత, ఏఈవో వరుణ్ వర్మ, రైతులు శ్యామ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**అకాల వర్షానికి పంట నష్టం**

గజ్వేల్, మార్చి 20: అకాల వర్షానికి మండలంలోని కొల్గూర్, శేర్‌పల్లి, దిలాల్‌పూర్, బెజుగామ గ్రామాల్లో మొక్కజొన్న, పొద్దుతిరుగుడు పంటలకు నష్టం జరిగింది. మంగళవారం సాయంత్రం కురిసిన వర్షానికి మండలంలోని కొల్గూర్‌లో చెట్టుకొమ్మ విరిగి పడడంతో టెన్త్ విద్యార్థి వెంకటేశ్ మృతి చెందిన విషయం తెలిసిందే. ఆయా గ్రామాల్లో సుమారు 120 ఎకరాల్లో మొక్కజొన్న, పొద్దుతిరుగుడు పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయాధికారులు అంచనా వేశారు.

**రైతు కుటుంబాలను ఆదుకోవాలి**

పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఎగొండస్వామి కోరారు. మండల కేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఆత్మ కమిటీ డివిజన్ మేనేజర్ మౌనికకు ఆయన వినతిపత్రం అందజేశారు. అనంతరం మండలంలోని ఆయా గ్రామాల్లో దెబ్బతిన్న కూరగాయ పంటలను పరిశీలించారు.

**దెబ్బతిన్న పంటలు**

బెజ్జంకి, మార్చి 20: మండల కేంద్రంతో పాటు, నర్సింహులపల్లి, రేగులపల్లి, లక్ష్మీపూర్, గూడెం, వడ్లూర్ బేగంపేట, దాచారంతోపాటు పలు గ్రామాల్లో వరి, మొక్కజొన్న, పొద్దుతిరుగుడు పంటలు దెబ్బతిన్నాయి. మండలంలో 1050 ఎకరాల్లో మొక్కజొన్న, 50 ఎకరాల్లో వరి, 42ఎకరాల్లో పొద్దుతిరుగుడు పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయాధికారి సంతోష్ కుమార్ తెలిపారు.

**రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి**

చిన్నకోడూరు, మార్చి 20: రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఎంపీపీ కూర మాణిక్యరెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వేలేటి రాధాకృష్ణశర్మ అన్నారు. మండలంలోని చంద్లాపూర్, ఇబ్రహీంనగర్, చౌడారంలలో దెబ్బతిన్న పంటలను వారు పరిశీలించారు. రైతులకు నష్టపరిహారం అందించా లని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయా గ్రామాల్లో జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్, మండల వ్యవసాయాధికారి జయంత్ కుమార్ క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి నష్టం వివరాలు సేకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జయలక్ష్మి, ఎంపీటీసీ దుర్గారెడ్డి, నాయకులు రవిగౌడ్, చంద్రమౌళి, రైతులు ఉన్నారు.



చిన్నకోడూరు: అకాల వర్షానికి దెబ్బతిన్న మొక్కజొన్న



బెజ్జంకి: నేలవాలిన మొక్కజొన్నను పరిశీలిస్తున్న ఏవో



గజ్వేల్: దెబ్బతిన్న బెండతోటను పరిశీలిస్తున్న ఎగొండస్వామి



తొగుట: వెంకట్రావుపేటలో దెబ్బతిన్న మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి

## నేడు ఎమ్మెల్యే పల్లా పర్యటన

చేర్యాల, మార్చి 20: మండలంలోని చిట్యాలలో గురువారం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పర్యటించనున్నట్లు ఎంపీపీ వుల్లంపల్లి కరుణాకర్ తెలిపారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన చర్చి ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే పర్యటన సందర్భంగా మండలంలోని ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, బీఆర్ఎస్ మండల, అనుబంధ సంఘాల నాయకులు, మార్కెట్, పీఏసీఎస్ చైర్మన్లు, డైరెక్టర్లు, గ్రామశాఖల అధ్యక్షులు హాజరు కావాలని కోరారు.

## అపరిచితుల ఫోన్‌కాల్స్‌కు స్పందించొద్దు

గజ్వేల్, మార్చి 20: ఆధునిక టెక్నాలజీ కాలంలో సెల్‌ఫోన్ల వినియోగం బాగా పెరిగిందని ఫెస్ ఫోరం సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ దయానంద్ అన్నారు. బుధవారం గజ్వేల్‌లోని విశ్రాంతి ఉద్యోగుల సంఘం భవనంలో ఏర్పాటు చేసిన సెల్‌ఫోన్ వినియోగదారుల అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. అపరిచితుల నుంచి వచ్చే ఫోన్‌కాల్‌కు ఎలాంటి సమాచారం ఇవ్వరాదన్నారు. అప్రమత్తంగా ఉండాలని, లేకపోతే నష్టాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో అశోక్‌వర్ధన్, విశ్రాంతి ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి నాగేశ్వర్‌రావు, రమేశ్, రాజరామ్ పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అవగాహన

మిరుదొడ్డి మార్చి 20: విద్యార్థులు సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్సై పరశురామ్ సూచించారు. బుధవారం మండలంలోని అల్వాల చౌరస్తాలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్సీ స్కూల్, కళాశాల విద్యార్థులకు సైబర్ నేరాలు, చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ

కొండపాక(కుకునూరుపల్లి), మార్చి 20: కుకునూరుపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బుధవారం ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షురాలిగా కొంతం లావణ్య, కన్వీనర్‌గా కూరెల్లి శ్రీనివాస్‌రెడ్డితో సభ్యులు ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నుకున్న అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఉపాధి పనుల పరిశీలన

మద్దూరు(ధూళిమిట్ట), మార్చి20: మద్దూరు మండలంలోని గాగిళ్లాపూర్, నర్సాయపల్లి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధిహామీ పనులతో పాటు హరిత నర్సరీలను బుధవారం ఎంపీడీవో రామ్మోహన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలకు పని ప్రదేశంలో నీటి సౌకర్యంతో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. నర్సరీల్లో మొక్కల సంరక్షణపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. హరితహారం కార్యక్రమానికి మొక్కలు సిద్ధంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో ఖాజామోహినుద్దీన్, టెక్నికల్ అసిస్టెంట్ మాధవి, పంచాయతీ కార్యదర్శులు రజియాబేగం, భాస్కర్ పాల్గొన్నారు.

## రూ.ఏడు లక్షల ఇంటి పన్ను వసూలు

గజ్వేల్, మార్చి 20: గజ్వేల్ మున్సిపల్ ప్రజ్ఞాపూర్‌లోని వివో బయోటెక్ కంపెనీకి సంబంధించిన 2023-24 ఆర్థిక సంవత్సరం ఇంటిపన్ను రూ.7,48,234లను మున్సిపల్ కమిషనర్ నరసయ్యకు కంపెనీ నిర్వాహకులు బుధవారం అందజేశారు. ఈ సపందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఈనెల చివరి వరకు ఇంటి పన్న చెల్లించాలన్నారు.

## గౌడసంఘం నూతన కమిటీకి సన్మానం

కొమురవెల్లి, మార్చి 20: ఇటీవల నూతనంగా ఎన్నుకున్న కొమురవెల్లి గౌడ సంఘం అధ్యక్షుడు తాళ్లపల్లి రాజుగౌడ్‌తో పాటు నూతన కార్యవర్గాన్ని బుధవారం బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గీస భిక్షపతి సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, గౌడ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలి

ములుగు, మార్చి 20 : చెక్‌పోస్టుల వద్ద ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలని గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని వంటిమామిడి చెక్‌పోస్టును బుధవారం ఆయన పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎన్నికల నేపథ్యంలో ఎవరైనా ఆధారాలు లేకుండా అక్రమంగా నగదు, మద్యం తరలిస్తే వెంటనే సీజ్ చేయాలని సీఐ మహేందర్‌రెడ్డి సూచించారు. చెక్‌పోస్టుల్లో విధులు నిర్వహించే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. తనిఖీల్లో ములుగు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## యువతకు తీరని అన్యాయం

మద్దూరు(ధూళిమిట్ట), మార్చి20: సింగరేణి ఉద్యోగ నియామకాల్లో సిద్దిపేట జిల్లాలో వీలినమైన ఎనిమిది మండలాల యువతకు తీరని అన్యాయం జరుగుతున్నదని బీఆర్ఎస్ ధూళిమిట్ట మండల అధ్యక్షుడు మంద యాదగిరి అన్నారు. బుధవారం ధూళిమిట్ట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి ఉద్యోగ నియామకాల్లో అప్పటి కరీంనగర్, వరంగల్, ఆదిలాబాద్, ఖమ్మం జిల్లాలకు చెందిన వారికి స్థానిక రిజర్వేషన్ కలిగి ఉండేదన్నారు. జిల్లాల పునర్విభజనలో భాగంగా ఉమ్మడి కరీంనగర్ నుంచి హుస్నాబాద్, అక్కన్నపేట, బెజ్జంకి, కోహెడ, ఉమ్మడి వరంగల్ నుంచి చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాలు నూతనంగా ఏర్పడిన సిద్దిపేట జిల్లాలో విలీనమయ్యాయన్నారు. సింగరేణి ఉద్యోగ నియామకాల్లో ఎనిమిది మండలాలకు చెందిన నిరుద్యోగులు స్థానిక రిజర్వేషన్ కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు చొప్పరి సాగర్, ముక్క కనకయ్య, దుబ్బుడు వేణుగోపాల్ రెడ్డి, బర్మ రాజమల్లయ్య, బండి చంద్రయ్య, నాచగోని వెంకట్‌గౌడ్, పంగ ఎల్లయ్య, చింతల వేణు, శ్రీరాముల సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంద యాదగిరి

## ఆరు గ్యారెంటీలను వెంటనే అమలుచేయాలి

వర్గల్, మార్చి 20: ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలని బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు మజీద్‌పల్లి నాగరాజు డిమాండ్ చేశారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ నాయకత్వంలో దేశానికే ఆదర్శమైన పాలన అందించిన ఘనత బీఆర్ఎస్‌కే దక్కుతుందని, రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక ఎంపీ స్థానాలు గెలుచుకొని సత్తా నిరూపిస్తామన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ వర్గల్ నాయకులు దిలీప్, కరుణాకర్, సద్దాంహుస్సేన్, స్వామిగౌడ్, ప్రభాకర్‌రెడ్డి, కిషన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంద యాదగిరి

## పూజారుల మధ్య ఘర్షణ పలువురికి గాయాలు

దుబ్బాక టౌన్, మార్చి 20: దుబ్బాక మున్సిపల్ పరిధిలోని రేకులకుంట మల్లిఖార్జునస్వామి ఆలయ పూజారుల మధ్య ఘర్షణ జరిగింది. బుధవారం ఆలయంలోని ఒగ్గు పూజారులు రెండు గ్రూపులుగా విడిపోయి ఒకరికొకరు కర్రలు, రాళ్లతో దాడులు చేసుకున్నారు. ఆలయ ప్రాంతం ఘర్షణ వాతావరణంగా మారింది. భక్తులు చెల్లాచెదురుగా పరుగులు తీసినట్లు సంఘటనను ప్రత్యక్షంగా చూసిన భక్తులు తెలిపారు. ఈ దాడుల్లో ఇరువర్గాల పూజారులకు తీవ్రగాయాలు కావడంతో దుబ్బాక ఏరియా దవాఖాన , సిద్దిపేట ప్రభుత్వ దవాఖానకు 108 వాహనంలో తరలించారు. పరస్పర దాడుల్లో సుమారు 20 మంది పూజారులు గాయపడినట్లు, కొందరు తీవ్రంగా గాయపడ్డట్లు తెలిసింది.

## ప్రతిఒక్కరూ సహకరించాలి

దుబ్బాక, మార్చి 20: పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని అదనపు కలెక్టర్, సహాయ రిటర్నింగ్ అధికారి గరీమాఅగర్వాల్ సూచించారు. బుధవారం దుబ్బాక సమీకృత కార్యాలయం(ఐవోసీ)లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా దుబ్బాక నియోజకవర్గంలో మూడు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొత్తం ఓటర్ల సంఖ్య 1,99,236 మంది ఉన్నారని, 253 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్, ఎంపీడీవోలు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గరిమాఅగర్వాల్



ఊరేగింపుగా జలకడువలను తీసుకెళ్తున్న ముదిరాజ్ కులస్తులు

## పెద్దమ్మ పండుగ ప్రారంభం

మద్దూరు(ధూళిమిట్ట), మార్చి 20: మద్దూరు మండలంలోని రేబర్తిలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మ పండుగ బుధవారం ప్రారంభమైంది. డప్పుచప్పుళ్లతో మహిళలు దేవాలయం వరకు ఊరేగింపుగా వెళ్లి దేవతామూర్తులకు జలాభిషేకం చేశారు. రాత్రి ఏడుగంటలకు ముదిరాజు కులస్తులు భక్తిశ్రద్ధలతో పోచమ్మతల్లికి బోనాలను సమర్పించి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో ముదిరాజు సంఘం అధ్యక్షుడు గూళ్ల కొంరెల్లి, కుల పెద్ద గూళ్ల కిష్టయ్య, ఉపాధ్యక్షుడు నీరటి మల్లేశం, కార్యదర్శి గవ్వల గణేశ్, కులపెద్దలు నీరటి యాదయ్య, గీకురు మైసయ్య, యాదగిరి, గూళ్ల శ్రీను, ఆలయ పూజారి నీరటి శేఖర్, సభ్యులు పాల్గొన్నారు.

## వర్షం ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన ప్రజాప్రతినిధులు

సిద్దిపేట, మార్చి 20: సిద్దిపేట పట్టణంలో మంగళవారం రాత్రి కురిసిన అకాల వర్షానికి నేలకొరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలు, కూలిపోయిన గృహాలను బుధవారం మున్సిపల్ కమిషనర్ ప్రసన్నరాణి, మున్సిపల్ వైస్ చైర్మన్ జంగిటి కనకరాజు, తహశీల్దార్ సలీమ్‌తో కలిసి మాజీ మున్సిపల్ చైర్మన్ కడవేర్గు రాజనర్సు పరిశీలించారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు సహకారంతో నిర్వాసితులను ఆదుకుంటామని మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు పట్టణ వాసులకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పట్టణ కౌన్సిలర్లు, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు, బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## నీటిని ఒడిసి పట్టి సంరక్షించాలి

జగదేవ్‌పూర్, మార్చి20: వాటర్ షెడ్డు ప్రాజెక్టుల నీటిని ఒడిసి పట్టి సంరక్షించాలని నాబార్డు డీడీఎం సిసిల్ త్రిమూర్తి, పీసీ స్వచ్ఛందసంస్థ డైరెక్టర్ నిమ్మయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నాబార్డు గోద్రేజ్ సంస్థ సహకారంతో ప్రారంభించిన వాటర్ షెడ్డు ప్రాజెక్టులను గ్రామ వాటర్ షెడ్డు ప్రాజెక్టు కమిటీలకు అప్పగించారు. వారు మాట్లాడుతూ గొల్లపల్లి, మునిగడప, మాందాపూర్, కొండాపూర్ ప్రాజెక్టులు జూన్ 30న ముగిసినందున వాటి నిర్వహణ బాధ్యతలు గ్రామ కమిటీలు చూసుకోవాలన్నారు. నీటి సంరక్షణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో వాటర్‌షెడ్ కమిటీ చైర్మన్లు నర్సింహులు, మమేశ్, వినయ్, ముత్యం, పీస్ సంస్థ కోఆర్డినేటర్ మహేశ్, మ్యాక్స్ సంస్థ మేనేజర్స్ శోభ, వెంకటలక్ష్మి, పద్మ, భాగ్యలక్ష్మి, మోహినుద్దీన్ పాల్గొన్నారు.



అక్కన్నపేట: అమరేందర్‌రెడ్డి విగ్రహం వద్ద జయంతి వేడుకల్లో పాల్గొన్న గ్రామస్తులు

## అమరేందర్‌రెడ్డి సేవలు చిరస్మరణీయం

అక్కన్నపేట, మార్చి 20: బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎడమల అమరేందర్‌రెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయమని హుస్నాబాద్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ లింగాల సాయన్న, రామవరం ఎంపీటీసీ లింగాల శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని రామవరంలో అమరేందర్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, గ్రామస్తులు మధుసూదన్‌రెడ్డి, ప్రతాపరెడ్డి, వెంకటరెడ్డి, సత్యనారాయణ, నారాయణ రెడ్డి, సంతోష్‌రెడ్డి, ప్రకాశ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వీరస్వామి, పరశురాములు, రాజిరెడ్డి, సంపత్, రమణ, కర్ణాకర్, మల్లయ్య, చందు, ప్రశాంత్, రాజేందర్, అనిల్, రాజయ్య, రామస్వామి పాల్గొన్నారు.

## భూసేకరణ వేగంగా పూర్తిచేయాలి

- కలెక్టర్ మను చౌదరి

సిద్దిపేట అర్బన్, మార్చి 20: సిద్దిపేట నుంచి సిరిసిల్లకు రైల్వే లైన్‌లో భాగంగా జిల్లాలోని చిన్నకోడూరు, నారాయణరావుపేట మండలాల్లో పెండింగ్‌లో ఉన్న భూసేకణ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ మను చౌదరి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ క్యాంపు కార్యాలయంలో రైల్వే ప్రాజెక్ట్ ముఖ్య అధికారులు, రెవెన్యూ అధికారులతో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. భూసేకరణను క్షేత్ర స్థాయిలో పరిశీలించి వివరాలు సేకరించాలని ఆయా మండలాల తహసీల్దార్లకు సూచించారు. రైల్వేలైన్ మాత్రమే కాకుండా పెండింగ్‌లో ఉన్న సర్వీస్ రోడ్ భూసేకరణ సైతం పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఆర్డీవో సదానందం, రైల్వే ప్రాజెక్ట్ చీఫ్ ఇంజినీర్ అమిత్ అగర్వాల్, డిప్యూటీ చీఫ్ ఇంజినీర్ సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

**ప్రతిపాదనలు సిద్ధం చేయాలి**

జిల్లా అధికారుల రిక్రియేషన్ క్లబ్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ మను చౌదరి ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. బుధవారం అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి కలెక్టరేట్, పోలీస్ కమిషనరేట్ కార్యాలయాల మధ్యలో ఉన్న స్థలాన్ని ఆయన పరిశీలించారు. ఈ మేరకు ఒక ఎకరంలో జిల్లా అధికారుల రిక్రియేషన్ క్లబ్ నిర్మాణానికి, చుట్టూ ప్రహరీ నిర్మాణానికి ప్రతిపాదన సిద్ధం చేయాలని ఆర్అండ్‌బీ డీఈ వెంకటేశ్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో రెహమాన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ మను చౌదరి

## ధ్యానంతోనే ప్రశాంతత

కొమురవెల్లి, మార్చి 20: ధ్యానంతోనే ప్రశాంతత చేకూరుతుందని సద్గురు మహదేవ స్వామి అన్నారు. మహారాష్ట్ర దెగ్లూర్ నుంచి తెలంగాణలోని యాదాద్రిభువనగిరి జిల్లా కొలనుపాక వరకు నిర్వహించే మహా పాదయాత్ర బుధవారం కొమురవెల్లికి చేరుకుంది. ఈ సందర్భంగా కొమురవెల్లి టీటీడీ కల్యాణ మండపం ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో సద్గురు మహదేవ్ స్వామిజీ మాట్లాడారు. అంతకుముందు మల్లికార్జునస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ సురేశ్ షెట్కార్, జనగామ డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, లింగాయత్ రాష్ట్ర నాయకుడు నరుకుళ్ల శివప్ప, మల్లన్న ఆలయ పునరుద్ధరణ కమిటీ చైర్మన్ పర్పాటకం లక్ష్మారెడ్డి, కొమురవెల్లి మండల లింగాయత్ అధ్యక్షుడు మహదేవుడి శ్రీనివాస్, మల్లన్న ఆలయ ప్రధాన అర్చకుడు మహదేవుడి మల్లికార్జున్, అర్చకబృందం, పాలకమండలి సభ్యులు, వీరశైవ ఆగమ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.



సద్గురు మహదేవ స్వామికి జ్ఞాపిక అందజేస్తున్న మాజీ ఎంపీ సురేశ్ షెట్కార్

## పోలీసుల విస్తృత తనిఖీలు



ముస్త్యాల రహదారిపై తనిఖీ చేస్తున్న పోలీసులు

చేర్యాల, మార్చి 20 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లా సరిహద్దు ముస్త్యాలలోని జాతీయ రహదారిలో ఏర్పాటు చేసిన సరిహద్దు చెక్‌పోస్టు వద్ద చేర్యాల సీఐ శ్రీను ఆధ్వర్యంలో ఎస్సై దామోదర్, పోలీస్ సిబ్బంది బుధవారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు చేర్యాల పోలీస్‌స్టేషన్ పరిధిలో ముస్త్యాల వద్ద చెక్‌పోస్టు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలు ఎలాంటి ఆధారాలు లేని నగదు, మద్యం తదితర వాటిని రవాణా చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. చెక్‌పోస్టుల వద్ద విధులు నిర్వహించే సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలన్నారు.

### ఓటు హక్కును వినియోగించుకోవాలి

వర్గల్, మార్చి 20: ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని మర్కూక్ ఎస్సై మధుకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని పాములపర్తిలో బుధవారం ఓటు హక్కు వినియోగం, సైబర్ నేరాలు, గంజాయి, జూదంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఎస్సై మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు అనేది వజ్రాయుధంలాంటిదన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఆర్థరైటిస్‌కు రోబోటిక్ చికిత్స

సిద్దిపేట అర్బన్, మార్చి 20: కీళ్ల నొప్పులు, మోకాళ్ల అరుగుదుల వంటి ఆర్థరైటిస్ వ్యాధులకు రోబోటిక్‌తో పాటు ఫిజియోథెరపీ చికిత్స అందించడం జరుగుతుందని యశోద దవాఖాన వైద్యుడు డా.సునీల్ కుమార్ తెలిపారు. బుధవారం సిద్దిపేట పట్టణంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ.. చాలామంది ఆర్థరైటిస్‌తో బాధపడుతున్న రోగులకు రోబోటిక్ జాయింట్ రిప్లేస్‌మెంట్ అనే అత్యాధునిక పద్ధతి ద్వారా సర్జరీలు చేయడం జరిగిందని తెలిపారు. సమావేశంలో యశోద దవాఖాన వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైద్యుడు సునీల్ కుమార్

## జూదం స్థావరం పై పోలీసుల దాడులు

చేర్యాల, మార్చి 20 : మండలంలోని చుంచనకోట గ్రామ శివారులోని మామిడి తోటలో కొనసాగుతున్న జూదం స్థావరం పై సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, చేర్యాల పోలీసులు దాడులు నిర్వహించి రూ.31,400 నగదు, ఆరు మొబైల్ ఫోన్లు, కారు స్వాధీనం చేసుకున్నారు. మేడ్చల్ పట్టణంలోని ఉమానగర్‌కు చెందిన ఇరుకుల నారాయణ, హైదరాబాద్ నగరంలోని అన్నానగర్‌కు చెందిన అనికే శ్రీకాంత్ పట్టుబడగా, హైదరాబాద్ నగరానికి చెందిన వారీగా అనుమానిస్తున్న గొల్ల శ్రీనివాస్‌యాదవ్, జన్మ శివకుమార్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా టాస్క్‌ఫోర్స్ అధికారులు మాట్లాడుతూ బహిరంగ ప్రదేశం, ఇండ్లల్లో జూదం ఆడితే సమాచారం ఇవ్వాలని కోరారు.అక్రమంగా ఇసుక, రేషన్ బియ్యం రవాణా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నట్లు సమాచారం ఉంటే వెంటనే సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ అధికారుల సెల్: 871266445 నంబర్‌కు ఫోన్ చేయాలని టాస్క్‌ఫోర్స్ అధికారులు కోరారు.



పట్టుబడ్డ నిందితులతో పాటు నగదు, టోకెన్ కాయిన్స్, సెల్‌ఫోన్లు

## వైభవంగా రథోత్సవం


రాయపోల్, మార్చి 20 : వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మండలంలోని వడ్డేపల్లిలో బుధవారం ఉదయం వీరభద్రస్వామిని రథోత్సవంపై గ్రామంలోని ప్రధాన వీధులగుండా ఊరేగింపుగా భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. రథం ముందు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం గ్రామస్తులు రథాన్ని ప్రారంభించారు. రథోత్సవాన్ని తిలకించేందుకు వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. అంతకుముందు ఆలయం వద్ద అగ్నిగుండాల తదితర కార్యక్రమాలు నిర్వహించారు. వడ్డేపల్లితో పాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు వీరభద్రస్వామిని దర్శించుకొని మొక్కలు చెల్లించుకున్నారు. ఉత్సవాలకు సహకారం అందించిన గ్రామస్తులు, నాయకులకు ఆలయ కమిటీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

**రామాలయం15వ వార్షికోత్సవం**

మర్కూక్, మార్చి 20: మండలంలోని పాములపర్తిలో రామాలయం15వ వార్షికోత్సవ పూజలు ఘనంగా జరిగాయి. ఆలయ ప్రధాన ధర్మకర్త హనుమంతరావు ఆధ్వర్యంలో పల్లకీసేవ, రథోత్సవ ఊరేగింపు వైభవంగా జరిగింది. భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.



రాయపోల్: వడ్డేపల్లిలో వీరభద్రస్వామి రథోత్సవం ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు



మర్కూక్: పాములపర్తిలో రథోత్సవంలో పాల్గొన్న భక్తులు